ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర

## (జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 6-1-96, శ్రీరమణ జయంతి)

ఆత్మ స్వరూపులైన మహాశయులారా,

ఈ రోజు రమణస్వామి116వ జయంతి. పుట్టింది మరణిస్తుంది. వచ్చింది పోతుంది. ఇక ఉన్నదేదో ఉంటుంది. ఇదీ సిద్ధాంతము. ఆత్మకు పుట్టుక లేదు, ఆత్మకు చావు లేదు, రమణుడు అంటే ఆత్మే. పుట్టుక ఎవరికి? ఉపాధికి మాత్రమే. మరణం ఎవరికి? ఉపాధికి మాత్రమే. ఉపాధిని తీసివేసిచూస్తే పుట్టుక లేదు, మరణం లేదు, ఒక అవతారపురుషుని యొక్క జయంతినిగాని, ఒక మహాజ్ఞానియొక్క జయంతిని గాని చేసుకోవటం ఎందుకంటే మనలను మనం పవిత్రం చేసుకోవటానికే. మన పవిత్రతకోసమే ఈ జయంతిని చేసుకొంటున్నాము. రమణభక్తులు ఈ రమణజయంతిని పండుగలాగ చేసుకుంటారు. ఆయన జీవితంలోని విషయాలగురించి మనకు తెలియకపోతే ఆయన సందేశముమీద కూడా మనకు ప్రీతి కలుగదు.

రమణస్వామి తండ్రిపేరు సుందరమయ్యర్, తల్లి పేరు అళగమ్మ. ఆయన ప్రాథమిక విద్య తిరుచ్చుళిలో జరిగింది. తిరుచ్చుళి కూడా శివక్షేత్రం. ఆయన జీవితం పొడుగునా శివక్షేత్రంతో అనుబంధము ఉంది. ఆయన హైస్కూలు విద్యకోసం మధురైలో ఉన్న పినతండ్రిగారి ఇంటికి వచ్చారు. ఆ రోజులలో ఆయన బంధువు ద్వారా అరుణాచలం పేరు వినటం జరిగింది. అరుణాచలం పేరు విన్నప్పుడు అది ఒక ఊరు అనే స్ఫురణ ఆయనకు రాలేదు. అరుణాచలం అంటే దేవుడే అనే స్ఫురణ కలిగింది. అది జన్మాంతర అనుబంధము. ఆయనకు 16వ సంవత్సరములో మధురైలో ఆయన పినతండ్రిగారి ఇంటివద్ద మరణానుభవం కలిగింది. అది కావాలి అని ఆయన కోరుకోలేదు. సాధనచేసి దానిని పొందలేదు. మరణానుభవం ద్వారా ఆయనహృదయంలో ఉన్న మరణంలేని వస్తువు ఆయనకు అనుభవంలోనికి వచ్చింది. అది ప్రత్యక్షానుభవం. నేను మనిషిని, నేను మనిషిని అని ఎవడూ అనుకోడు. ఎందుచేతనంటే నేను మనిషిని అనేది నా అనుభవం నేను మనిషిని అనే అనుభవం మనకు ఎంత సహజముగా ఉందో నేను బ్రహ్మమును అనే అనుభవం అంత సహజముగా ఆయనకు మరణానుభవంద్వారా కలిగింది. ఇంక ఊహలు అక్కరలేదు సాధన అక్కరలేదు.

లోకజ్ఞానము జ్ఞానము కాదు. శాస్త్రజ్ఞానము జ్ఞానము కాదు. లోకం అంతా ఒక తత్త్వం వ్యాపించి ఉంది. అది నీ హృదయంలోనూ ఉంది. దానికి మరణం లేదు. దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటమే నిజమైన జ్ఞానము. దానిని పొందటానికి నీవు చేసే ప్రయత్నమే సాధన. దానిని పొందటంకోసం ఆత్మవిచారణ, శరణాగతి చెప్పారు. వారి ప్రవృత్తినిబట్టి, జన్మాంతర సంస్కారమునుబట్టి ఒకరు విచారణా మార్గమును ఇష్టపడతారు, ఒకరు శరణాగతి మార్గమును ఇష్టపడతారు. మార్గములు వేరైనా చేరుకొనే గమ్యం ఒక్కటే. ఉన్న సత్యం ఒక్కటే. దానిని అనేక మతములలో అనేక రూపములతో, అనేక నామములతో ఆరాధిస్తున్నారు. ఏ మతం ద్వారా ఏ నామం ద్వారా ఆరాధించినప్పటికీ ఉన్న సత్యం ఒక్కటే. ఉన్న వెలుగు ఒక్కటే. మహాంధకారములోనుండి మరణానుభవం ద్వారా ఆ వెలుగును 16వ సంవత్సరములోనే రమణస్వామి పొందారు. 1896జులై, 16వతేదీన ఆయనకు మరణానుభవం కలిగింది. మరణానుభవం కలిగిన తరువాత జీవితంలో జరిగే సంఘటనలపట్ల, బంధువులపట్ల స్నేహితులపట్ల, ప్రాపంచిక విషయములపట్ల ఆయన దృష్టి అంతా మారిపోయింది. ప్రపంచాన్ని చూసేటప్పుడు

అంతకుముందు ఉన్న దృష్టి వేరు. ఇప్పుడు ఉన్న దృష్టి వేరు. జ్ఞాని, అజ్ఞాని కూడా ప్రపంచమును చూస్తారు. అజ్ఞాని బ్రహ్మమునే ప్రపంచముగా చూస్తాడు. జ్ఞాని ప్రపంచమును కూడా బ్రహ్మంగా చూస్తాడు. రాగ ద్వేషములు అనే కెరటాలమీద ఈదుకొంటున్న మనకు బ్రహ్మంయొక్క వైభవం ఎలా తెలుస్తుంది. కామక్రోధములు అనే కెరటాలమీద ఈదుతున్న మనం లోపలకు అంటే నేనుయొక్క జన్మస్థానం దగ్గరకు వెళ్ళలేకపోతున్నాము.

బ్రహ్మానుభవం కలిగిన తరువాత ఆయన శరీరమును అరుణాచలేశ్వరుడు స్వాధీనం చేసుకొని ఉపదేశముకోసం అరుణాచలం తీసుకొని వచ్చాడు. ఆయన అన్నగారితో నీబోటి యోగికి ఇంటి దగ్గర పని ఏముంది, ఎక్కడికైనా పోరాదా అని అనిపించాడు. ఈయన హృదయంలో అరుణాచలం అనే స్ఫురణను కలుగజేసాడు. అరుణాచలం వెళ్ళటానికి నిలబడ్డాడు. మరి డబ్బు ఎక్కడనుండి వస్తుంది. అప్పుడు అన్నగారు గూటిలో ఉన్న డబ్బుతీసుకొని నా కాలేజీ ఫీజు కట్టు అని అన్నారు. అంటే అరుణాచలేశ్వరుడు డబ్బుకూడా ఏర్పాటు చేస్తున్నాడు. నా జీవితంలో ఒకేసారి అబద్ధం చెప్పాను అన్నారు ఆయన. అరుణాచలం వెళ్ళటానికి నిలబడ్డాక స్కూలుకు వెళ్తున్నాను అని చెప్పాడు. అప్పుడు అబద్ధం చెప్పాను. అన్నారు.

రమణస్వామి 1896వ సంవత్సరం సెప్టెంబరు నెల 1వ తేదీన అరుణాచలం వచ్చారు. అరుణాచలం అంటే తిరువణ్ణామలైలో ఉన్న ఒకపవిత్రమైన కొండ. ఆయన అరుణాచలేశ్వరుడితో ఓఅప్పా నీవు రమ్మంటే నేను వచ్చాను అన్నాడు. అంతేగాని జ్ఞానమును ప్రసాదించు, వైరాగ్యమును ప్రసాదించు అని అడుగలేదు. అడగవలసిన అవసరం ఆయనకు లేదు. ఎందుచేతనంటే అప్పటికే ఆయనకు తత్వం అవగాహన అయింది. గుడిలో ఏ దేవుడు అయితే ఉన్నాడో ఆ దేవుడు అప్పటికే అనుభవంలోనికి వచ్చి ఉన్నాడు.

రమణస్వామికి అప్రయత్నంగానే హృదయంలో ఉన్న తత్వం అనుభవంలోనికి వచ్చింది. అది జన్మాంతర అనుబంధం అనండి, దేవరహస్యం అనండి ఏమనుకున్నా జరిగిన సంఘటన అది. హృదయంలో ఉన్న తత్వం మనకు అర్థమయితే పూర్వజన్మ గొడవ ఉండదు, పునర్జన్మ గొడవ ఉండదు. ఈ గొడవలు అన్నీ తత్వం అనుభవంలోనికి వచ్చినపుడు ఒకేసారి అణిగిపోతాయి. తత్వం మనచేతికి అందినపుడు పుణ్యము, పాపము అని, ధర్మము అధర్మము అనే ద్వంద్వాలు ఈ పోరాటాలు అన్నీ ఆగిపోతాయి. పరిశుద్ధమైన జ్ఞానమే సన్యాసము అని చెప్పారు. అరుణాచలం వచ్చినరోజునే అక్కడ గుడిలో ఉన్న చెరువులో స్నానం చేసి కౌపీనం ధరించి ఆయనకు ఆయనే సన్యాసం తీసుకొన్నారు. ఆయన అరుణాచలంలో 54 సంవత్సరాలు ఉన్నారు. ఆశ్రమం ఏర్పడింది. ఆశ్రమానికి ఆస్తులు పెరిగాయి. ఆశ్రమానికి గొప్పగొప్ప పండితులు, కవులు వచ్చారు. ప్రపంచములో ఉన్న అన్ని మతములలో అన్ని దేశములలో ఉన్న మేధావులు అనేకమంది వచ్చి ఆయనను దర్శించారు. ఆయన మాత్రం కౌపీనం విడిచిపెట్టలేదు. ఆయన ఋషి అంటే.

మాయ అంటే ఏమిటి అని ఒక దొరగారు భగవాన్‌ను అడిగారు. ఆరోజు భగవాన్ ఆయనకు సమాధానం చెప్పలేదు. మరుసటి రోజున రాధాకృష్ణన్‌గారు ఆశ్రమానికి వచ్చారట. ఆయన భగవాన్ దగ్గర కొద్దిసేపు కూర్చొని వెళ్ళిపోతుంటే భగవాన్ దగ్గర హాలులో కూర్చున్నవారంతా రాధాకృష్ణన్‌గారికూడా బయటకు వెళ్ళిపోయారట. ప్రశ్న అడిగిన దొరగారు మాత్రం అక్కడే ఉన్నారట. అప్పుడు భగవాన్ దొరగారితో మాయ అంటే ఏమిటో ఇప్పుడు తెలిసిందా మీకు అన్నారట. వచ్చినపని మర్చిపోవటం మాయ. అందరూ నన్ను చూడటానికి వచ్చారు. కాని వారంతా రాధాకృష్ణన్‌కూడా బయటకు వెళ్ళిపోయారు. సాధారణంగా లోకం అంతా అధికారం చుట్టూ, డబ్బు చుట్టూ తిరుగుతూ ఉంటుంది. ఇదే మాయ. అర్థమవుతోంది కదా అన్నారట భగవాన్.

ఆరోగ్యము, అధికారము, ధనం ఇవి మూడూ ఉంటే మనం సుఖంగా ఉండవచ్చు ఆనందముగా ఉండవచ్చు అని మనకు అనిపిస్తుంది. కాని ఇవి మూడూ ఉన్నవాళ్ళు లోకంలో చాలామంది ఉన్నారు. వారు అందరూ సుఖంగాను, ఆనందంగానూ ఉన్నారా? అంటే లేరు. మోక్షమును పొందేవరకూ సుఖం తెలియదు. మోక్షం అంటే

విడుదల దేనినుండి అంటే జననమరణ ప్రవాహమునుండి విడుదల. ఆవిడుదల పొందినివాడికి సుఖం తెలుస్తుంది. ఎవడైతే మోక్షమును పొందాడో వాడే నిజమైన సుఖి. ధనంలోను, ఆరోగ్యంలోను, అధికారంలోను సుఖం ఉందని మనం అనుకొంటున్నాము. మోక్షంలోనే నిజమైన సుఖం ఉందనే అవగాహన మనకు రాలేదు.

భగవాన్ సందేశమును భారతదేశములో వ్యాప్తిచేసినవారిలో గణపతి శాస్త్రిగారు ముఖ్యులు. ప్రాశ్చాత్యదేశములలో ఆయన సందేశమును మొదట పాల్‌బ్రింటన్ వ్యాప్తి చేసారు. భగవాన్ విరూపాక్షగుహలో ఉండగా 1907వ సంవత్సరములో గణపతిశాస్త్రిగారు భగవాన్ దగ్గరకు వచ్చారు. గణపతిశాస్త్రిగారు వచ్చేప్పటికి అక్కడ ఎవరూ లేరు, భగవాన్ ఒక్కరే ఉన్నారు. శాస్త్రిగారు భగవాన్ పాదాలకు నమస్కరించి చదవవలసిన గ్రంధాలు అన్నీ చదివాను, చేయవలసిన మంత్రజపం అంతా చేసాను, ఎన్నో గ్రంధాలు పరిశీలించి చూసాను. అయినప్పటికీ తపస్సుయొక్క స్వరూపము నాకు అందలేదు, నాకు అవగాహనకాలేదు అని గణపతిశాస్త్రిగారు వినయంగా అడిగి సమాధానం కోసం ఎదురుచూస్తున్నారు. నేను అనే ఒక తలంపు ఉంది. ఈ నేను అనే తలంపు ఎక్కడనుండి వస్తోందో పరికించి, పరిశోధించి చూస్తే నీ మనస్సు అక్కడ లయం అవుతుంది. అదే తపస్సు అని భగవాన్ చెప్పారు. ఇది సాధనకు చాలాముఖ్యము. జ్ఞానమార్గము అంటే ఇష్టపడేవారు ఈ వాక్యమును బాగా అర్ధంచేసుకోవాలి. దానిలోతులను చూడాలి. మనకు నేను అనే తలంపు ఉంది. ఇది ఎక్కడనుండి పుట్టి వస్తోంది అని పరిశీలించి చూడగా, చూడగా మనస్సు అక్కడికే వెళ్ళి లయిస్తుంది. అక్కడే అది నశిస్తుంది. రమణమహర్షి చెప్పినవి అన్నీ ఆయన అనుభవంలోనుండి చెప్పినమాటలు. ఊహించి చెప్పిన విషయములుకాదు. ఆయన అనుభవంలోనుండి తీసి మనకు అనుభవం కలిగేటట్లు చెప్పటం. అదీ అక్కడ విశేషం.

గాఢనిద్రలోనుండి మెలుకువలోనికి వచ్చాక మొదట నేను అనే తలంపు వస్తుంది. తరువాత శరీరము కనబడుతుంది, ప్రపంచము కనబడుతుంది, వృత్తి తెలుస్తుంది, దేవుడు జ్ఞాపకం వస్తాడు. గాఢనిద్రలోనుండి జాగ్రదావస్థలోనికి వచ్చేముందు ఈ నేను అనే తలంపు ఎక్కడపుట్టి వస్తోందో అదే ఆధ్యాత్మిక హృదయము. జాగ్రదావస్థలోనుండి గాఢనిద్రలోనికి వెళ్లేముందు ఈ నేను అనే తలంపు ఎక్కడకు వెళ్ళిలయిస్తుందో అదే ఆధ్యాత్మిక హృదయము. గాఢనిద్రలో మనస్సు దాని పుట్టుస్థానమైన హృదయంలో ఉంటుంది. అక్కడ నామ, రూప చింతన ఉండదు. లోకచింతన ఉండదు. దేవుడు గొడవ ఉండదు. జాగ్రదావస్థలోనికి వచ్చినపుడు అది లెగిసి మెదడులోనికి వస్తుంది. అన్ని అనర్ధాలకు, అన్ని కష్టాలకు, రాబోయే జన్మలకు అన్నింటికి ఈ మనస్సే కారణము.

మనకు నేను అనే తలంపు ఉంది. ఎవరు మనకు నేనుగా వ్యక్తమవుతున్నారు? దేహమునకు నేను అనే శక్తి లేదు. అది జడము. మనలోపల ఉన్న చైతన్యము నేను అని అనదు. దానికి దీనికి మధ్యలో నేను అనే తలంపు పుట్టుకొని వస్తోంది. నీ మూలం నీహృదయంలోనే ఉంది. కాని మనం శాస్త్రములలో వెదుకుచున్నాము. నీ మూలం నీ హృదయంలోనే ఉంది కాబట్టి నీవు హృదయంలోనే అన్వేషించాలి. నీ హృదయంలోనే వెతకాలి. శాస్త్రములలో వెదికితే అది తెలియదు. శాస్త్రములు గురువు మార్గమును చూపిస్తారు. ఉపదేశము చేస్తారు. దానిని నీవు అర్ధంచేసుకొని, అవగాహన చేసుకొని నీ హృదయంలోనే ఆ వస్తువు ఉంది కాబట్టి నీ హృదయంలోనికి మునిగి దానిని పట్టుకోవాలి. విచారణ నీలోపలే జరగాలి. ఈ ప్రపంచము, శాస్త్రములు అన్నీ మనదేహమునకు బయట ఉన్నాయి. నీ మూలం నీలోపల ఉంది. నేను అనే తలంపు మూలం నీకు తెలియకపోయినా నేను అనే తలంపు నీకు తెలుస్తోంది. కుక్క యజమాని యొక్క వాసన పట్టుకొని యజమాని యొక్క జాడ ఎలాగయితే తెలుసుకొంటుందో నీవు అలాగే నేను అనే తలంపును ఆధారముగా చేసుకొని నేను అనే తలంపును నెమ్మదిగా ఉపసంహరించటంవలన అది దాని మూలంలోనికి వెళుతుంది. అది దాని మూలంలోనికి వెళ్ళినపుడు అది నాశనం అవుతుంది. అది నాశనం అయినపుడు నీవు పోతావు అని అనుకోవద్దు. వైకుంఠములో ఏ నారాయణుడు

అయితే ఉన్నాడు అనుకొంటున్నావో, కైలాసములో ఏ శివుడు అయితే ఉన్నాడు అనుకొంటున్నావో వాడు నీ హృదయంలోనే ఉన్నాడు. వాడు నీ మనస్సుకు వెనకాలే ఉన్నాడు. నేను అనే తలంపుకు వెనకాలే ఉన్నాడు. అందుచేత నీ మనస్సును అంతర్ముఖం చేస్తే దాని వెనుక ఉన్న దేవుడు నీకు తెలుస్తాడు.

మనం ఏదైతే నేను, నేను అంటున్నామో వాడే జీవుడు. మనం మరణించిన తరువాత ప్రయాణించేవాడు కూడా వాడే. వాడు ఎవడో నీవు అర్ధంచేసుకొంటే ప్రయాణాలు ఆగిపోతాయి అని బుద్ధుడు చెప్పాడు. అంటే పునర్జన్మ ఉండదని చెప్పాడు. జీవుడి యొక్క మూలం అంటే అహంకారము యొక్కమూలం మనకు తెలియనంతకాలము మనం శవాలను మోయవలసిందే, మనలో ఎవడైతే నేను, నేను అంటున్నాడో వాడే సాధనచేస్తున్నాడు. పూజ చేసేవాడు, జపంచేసేవాడు, విచారణ చేసేవాడు వాడే. వాడు ఉన్నంత సేపు పూజచేయాలి, అన్వేషణ చేయాలి అన్నీ చేయాలి. వాడిని తీసివేస్తే ఏ గొడవ లేదు అన్నారు. ఎవడైతే నీలోపల ఉండి, సాధన చేస్తున్నాడో వాడిని తీసివేయగలిగితే సాధనలతో పనిలేదు. అందుచేత నీవు జపించే వాడిని జపించవయ్యా ఆ జపం ఎవడూ చేయటం లేదు అన్నారు.

నేను ఎవడను? అను విచారణచేయాలంటే సత్వగుణం ఉండాలి. సత్వగుణం కావాలి అంటే ఆహారనియమం ఉండాలి. సాత్వికమైన ఆహారం తీసుకోవాలి. సత్పురుషుల సహవాసం ఉండాలి. సజ్జన సాంగత్యము అవసరము. వీటివలన సూక్ష్మబుద్ధి వస్తుంది. సూక్ష్మబుద్ధి సహాయంవలన విచారణ చేయగలముగాని శాస్త్రములు చదివినంతమాత్రముచేత చేయలేము. అందువలన ఆహారవిషయంలో యుక్తంగా ఉండాలి. మాటలవిషయంలో యుక్తంగా ఉండాలి.

తపస్సుచేసి చేసి దొరికాడు దొంగ అన్నాడు జనకమహారాజు. నాహృదయంలో ఉన్న ఆనందమును, శాంతిని నాకు అందకుండా చేసేది ఈ మిధ్యానేను అని నాకు ఇప్పుడు తెలిసింది. ఇంతవరకూ ఎవరి కారణంగానో ఆనందము, శాంతి నాకు దొరకటం లేదు అనుకొన్నాను. ఈ నేను అనే తలంపు కారణంగానే దొరకటం లేదు అన్న సంగతి ఈ నాటికి నాకు అర్ధమయ్యింది. దొంగ ఎవడో నాకు తెలిసాడు కాబట్టి వాడు నశించే వరకూ ఆ దొంగను విడిచిపెట్టను అన్నాడు జనకమహారాజు.

నేను అనే మొదటి తలంపును దానికి వచ్చే ఇతర తలంపులను కలిసి మనస్సు అన్నారు. ఇది స్వతంత్రమైనది కాదు. దానికి ఏదో ఒక ఆకారము, ఒక పేరు ఉండాలి. స్వతంత్రముగా అది ఉండలేదు. దేహం చనిపోయిన తరువాత అది క్రొత్త దేహంకోసం వెతుక్కొంటుంది. అప్పుడు క్రొత్తదేహము వస్తుంది. దానినే పునర్జన్మ అన్నారు. మరణించిన తరువాత దేహంలో మార్పువస్తుంది. పరిసరాలలో మార్పు వస్తుంది. స్నేహితులు, కుటుంబం మారుతాయి. కాని అహంకారములో మార్పు రాదు. నీ తలంపులు, నీ ఊహలు, నీ ఆలోచనలు అన్నీ నీ అహంవృత్తిమీదే ఆధారపడి ఉన్నాయి. అందువలన అహంకారము ఉంటే అంతా ఉంది, అది లేకపోతే ఏదీ లేదు అనేవారు భగవాన్.

ఎవరికైనా ఉపకారము చేసాము అనుకోండి. స్వార్ధం లేకుండా నీవు చేసేపనిద్వారా కూడా Satisfyఅయ్యేది నీ అహంకారము మాత్రమే. స్వార్ధంతో నీవు చేసే పనులమాట వదలివేయండి. స్వార్ధంలేకుండా చేసేపనులద్వారా Satisfyఅయ్యేది నీ అహంవృత్తిమాత్రమే. ఇది బాగా అర్ధంచేసుకోండి. నీవు ఇతరులకు సహాయంచేసినపుడు, ఏదైనా మంచిపనులు చేసినప్పుడు, స్వార్ధంలేకుండా నీవు పనిచేసినపుడు నీకు సంతోషం కలిగింది అనుకో. అప్పుడు సంతోషించేది నీలోపల ఉన్న నిజంకాదు. అప్పుడు సంతోషించేది కూడా నీ అహంకారమే. ఇతరులు చెప్పనక్కరలేదు. పరిశీలించుకొంటే అది మీకు కూడా తెలుస్తుంది. Selfless work ద్వారా Satisfyఅయ్యేది కూడా నీ అహంకారము మాత్రమే.

ఈ ప్రపంచము, దేవుడు మనలను చూసి నవ్వుకొంటున్నారట. నన్ను పరిశోధిస్తున్నావు. నన్ను పరిశోధించే

ఈ నేను ఎవడు అని ప్రపంచము మనలను అడిగితే మనం ఏమీ చెప్పలేము. దేహము మరణించిన తరువాత ఈ నేనును తీసుకొనివెళ్ళి కైలాసములోనూ, వైకుంఠములోనూ కూర్చోబెడదామని ఊహించేవారేగాని ఈ మిథ్యానేనునుండి, రూపము లేని ఈ అహంకార పిశాచమునుండి విడుదల పొందటానికి ఎవరూ ప్రయత్నంచేయటంలేదు. ఇదే మాయ అన్నారు భగవాన్. అహంకారమునకు రూపము లేదు. అది ఏదో ఒక రూపమును పట్టుకొని ఉంటుంది. అది ఒక పిశాచము. ఈ పిశాచములోనుండి విడుదలపొందటానికి ప్రయత్నం చెయ్యి. శరీరం ఉండగా, పరిస్థితులు నీకు అనుకూలంగా ఉండగా నీవు సాధన చేయలేనప్పుడు ఎప్పుడో మరణించిన తరువాత చేస్తానంటే నమ్మకం ఏముంది. ఈ రోజు చేయలేనప్పుడు రేపు చేస్తావని నమ్మకం ఎక్కడ ఉంది. ఇప్పుడే చెయ్యి. ఇక్కడే చెయ్యి. సోమరితనంగా ఉండవద్దు. సోమరితనంగా రోజులు పాడుచేసుకోవద్దు. ఇతరుల విషయాలలోనికి వెళ్ళవద్దు. మీ పనులు మీరు చేసుకొంటూ ఈ నేనును విచారణ చెయ్యండి. సోమరితనంగా జీవితమును గడపవద్దు అని ఆయన సందేశము.

వస్తువు మనహృదయంలోనే ఉంది. మనస్సును రవ్వంత, ముల్లంత అంతర్ముఖం చేయాలి. రూపచింతన, నామచింతన ద్వారా మనస్సుకు food Supplyఅవుతుంది. మనస్సు హృదయంలో ఉన్నప్పుడు రూపచింతన, నామచింతన ఉండదు. అంటే మనస్సుకు food supplyఆగిపోతుంది. మనస్సు హృదయ నివాసము చేయగా చేయగా మనస్సు హృదయాకారం చెందుతుంది. అప్పుడు జన్మలు లేని స్థితికి ఎదుగుతావు.

మనం నేను, నేను అనేది నిజం అనుకొంటున్నాము. సాధనచేసి ఈ నేనును పోగొట్టుకుంటే మనం పోతామేమోనని మనకు భయం. అందువలన దానిని విచారణ చేయటంలేదు. అందరిని బోను ఎక్కిస్తున్నారు గాని ఈ నేనును ఎవరూ బోను ఎక్కించటం లేదు. ఈ నేనును బోను ఎక్కించండి, విచారణ చేయండి అంటున్నారు భగవాన్.

మానవుడికి దుఃఖకారణము ఎక్కడో బయటలేదు. దుఃఖకారణము లోపలే ఉంది. అహంకారరూపములో ఉంది. అహంకారము నశించేవరకూ దుఃఖము మనిషిని వెంటాడుతూనే ఉంటుంది. తాత్కాలికంగా మీరు సుఖంగా ఉండవచ్చు. అంటే దుఃఖము వాయిదాపడుతోంది అని అర్థం. మోక్షస్థితిని మీరు పొందేవరకూ దుఃఖము నిన్ను విడిచిపెట్టదు. ఏదో రూపములో దుఃఖము నిన్ను వెంటాడుతూనే ఉంటుంది. దుఃఖములేని స్థితికి మనం ఎదగాలంటే మోక్షస్థితిని పొందితీరవలసిందే. మనిషియొక్క గమ్యము మోక్షమే. మోక్షం అంటే విడుదల. దేనినుండి విడుదల అంటే మిథ్యానేనులోనుండి విడుదల.

ఇప్పుడు మనకు నిజంకానిది నిజంవలె కనబడుతోంది. నీ హృదయంలో ఉన్న నిజం తెలుసుకోనేవరకూ నిజంకానిది నిజంవలె కనబడుతుంది. ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు. ఉన్నాదానిని నీవు లేదు లేదు అనుకొన్నా అది ఉంది. నీవు లేనిదానిని ఉంది ఉంది అనుకొన్నప్పుడు కూడా అది లేదు. అనుభవంలేనపుడు అనుకోవటాలు. అనుభవం ఉంటే అనుకోవటాలు అక్కరలేదు. వస్తువు నీచేతిలో ఉన్నప్పుడు ఊహలతో పనిలేదు. మీరు జాగ్రత్తగా సూక్ష్మబుద్ధిని పెంచుకొని ఆహారవిషయంలో యుక్తంగా ఉండి, సత్పురుషుల సహవాసం చేస్తూ, మాటలవిషయంలో యుక్తంగా ఉంటూ, నిద్రవిషయంలో కూడా యుక్తంగా ఉంటే భగవాన్ చెప్పిన నేను ఎవడను అను విచారణ చేయగలరు. అది మీరు అనుకొన్నంత కష్టం కాదు. అర్థమవుతూ ఉంటే మీకు తేలికగా ఉంటుంది.

భగవాన్‌కు తల్లితండ్రులు పెట్టినపేరు వెంకటరామన్. గణపతిశాస్త్రిగారు రమణమహర్షి అని నామకరణం చేసారు. ఋషి అంటే యదార్థమును గ్రహించినవాడు, తత్వమును తెలుసుకొన్నవాడు, జ్ఞానమును అనుభవించినవాడు.

భగవాన్‌ను ఏది అడిగినా చివరకు నేను దగ్గరకు తీసుకొనివస్తారు. చదువుకొన్నవారు వచ్చినా, చదువులేనివారు వచ్చినా అందరికీ ఈ నేను గురించే చెపుతున్నారు. ఈ నేను ఎవడో తెలుసుకో, నేను యొక్కమూలం తెలుసుకో,

ఈ నేనును విచారణ చెయ్యి అని చెపుతారు ఏమిటి అని శాస్త్రిగారు ఒకసారి భగవాన్‌ను అడిగారు. అప్పుడు భగవాన్ శాస్త్రిగారితో చదువుకొన్నవారు అందరికీ నిజం చెప్పి, చదువులేనివారికి అబద్ధం చెప్పమనా మీ ఉద్దేశ్యం అన్నారు. మీరు చెప్పమంటే అబద్ధం చెపుతాను. అబద్దాలు చెప్పి చెప్పి ఇంతవరకూ నేను చెప్పినది అంతా అబద్ధం అని మరల నేనే చెప్పాలి అన్నారు భగవాన్. ఆయన రమణమహర్షి అంటే. ఏ కాంక్ష లేదు. [redacted] రక్తమాంసములలో ఉన్న దేవుడు ఎలా ఉంటాడు అంటే రమణమహర్షిగారిలో చూడండి అని రాధాకృష్ణన్ చెప్పాడు.

రమణమహర్షిగారు చెప్పే సమాధానాలు హేతుబద్ధంగా ఉంటాయి, Properగా ఉంటాయి, Scientificగా ఉంటాయి. దేవుడు ఉన్నాడా అని ఒకరు భగవాన్‌ను అడిగితే నీవు ఉన్నావా అని భగవాన్ అడిగారు. నేను ఉన్నాను అని చెప్పాడు. నీవు ఉంటే వాడు లేకుండా ఎక్కడికి పోతాడు, వాడూ ఉన్నాడు అన్నారు. నీవు ఉంటే దేవుడు ఉన్నాడు, పూర్వజన్మ ఉంది, పునర్జన్మ ఉంది, స్వర్గనరకములు ఉన్నాయి. అన్నీ ఉన్నాయి. ఇవి అన్నీ నేను మీద baseఅయి ఉన్నాయి. దేవుడు ఉన్నాడా, లేడా అని ఇంకొకరు భగవాన్‌ను ప్రశ్నించారు. దేవుడు లేడు అనుకో ఏ గొడవలేదు, నిజంగా దేవుడు ఉన్నాడు అనుకో నీ అవసరము వాడికి లేదు అని చెప్పారు.

ఈశ్వరుడు జీవులను వారివారి ప్రారబ్ధము ననుసరించి ఆడిస్తున్నాడు. జరుగవలసినది జరిగే తీరును. జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నము చేసినా జరుగనే జరుగదు. ఇది నిశ్చయం అని భగవాన్ తల్లికి చెప్పిన ఉపదేశము. జరుగవలసినది జరిగే తీరును అని చెపుతున్నారు ఇంక ఈ సాధనలు ఎందుకు అని ఒకరు భగవాన్‌ను అడిగారు. దేహం దాని ప్రారబ్ధము ప్రకారము నడుస్తుంది. నీవు సాధన చేస్తూ ఉంటే ఆ సాధనాబలం వలన బాహ్యసంఘటనల ప్రభావము నీ మీదపడదు. నీకు దుఃఖము వచ్చినా నీ సాధనాబలం వలన అది నిన్ను బాధించదు. చీకటి వచ్చినా నీ సాధనాబలం వలన అది నీకు వెలుతురులాగ కనబడుతుంది. నీ సాధనాబలం వలన బాహ్య సంఘటనల ప్రభావము నిన్ను అంటదు.

నేను పుట్టాను అనుకొనే వాడికి ఎవడికీ మోక్షం రాదు అని భగవాన్ చెప్పారు. వాడు పూజలు చేసినా, జపాలు చేసినా మోక్షం రాదు. నేను పుట్టాను అని అనుకొంటూ ఉంటే పుట్టినది ఎవరు? దేహం పుట్టింది. అంటే వాడికి దేహబుద్ధి నశించలేదు. దేహబుద్ధి నశించలేదు కాబట్టి దేహం పుట్టినపుడు నేను పుట్టాను అని అనుకొంటున్నాడు. దేహబుద్ధి నశించేవరకూ మోక్షం రాదు.

మన లోపల ఉన్నవాసనలు మనకు తెలియకుండా బయటకు పోవటానికి ఆస్కారము లేదు. గురువు వాటిని మనకు తెలియజేస్తాడు. వాటిని మనకు తెలియజేసి అప్పుడు తొలగిస్తాడు. భగవాన్ తల్లిగారికి అనేక జన్మలను తీసుకొని వచ్చే సంస్కారములు ఉన్నాయి. వాటిని తల్లిగారికి తెలియజేసి సూక్ష్మశరీరములలో వాటిని అనుభవింపజేసి చివరస్థితిని కలుగజేసారు భగవాన్. తల్లిగారు వెళ్లిపోయారు అని ఒకరు భగవాన్‌తో అంటే తల్లిగారు వెళ్ళిపోలేదు వారు ఐక్యం అయ్యారు అన్నారు భగవాన్. వెళ్లిపోవటం అంటే ఇంకో జన్మలోనికి వెళ్లటం. వారు బ్రహ్మంలో ఐక్యం అయ్యారు అన్నారు.

1950వ సంవత్సరము ఏప్రియల్ 14వ తేదీ రాత్రి 8గం.47ని.లకు భగవాన్ దేహం చాలించారు. ఆయన శరీరము విడిచిపెట్టిన క్షణంలో ఒక కాంతి ఆకాశములో ప్రయాణించి అరుణగిరిలో అదృశ్యమయింది. పూర్వం అరుణాచలయాత్రచేయనివారు ఒకసారి అరుణాచల యాత్ర చేయండి. ఎందుచేతనంటే ఇక్కడికి వచ్చినవారు ఎవరూ వట్టి చేతులతో బయటకు వెళ్ళరు. నాస్తికులు ఆస్తికులు అవుతారు, ఆస్తికులు భక్తులు అవుతారు, భక్తులు జ్ఞానులు అవుతారు అని భగవాన్ చెప్పారు.

(జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము 25-2-96)